www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 9 సెప్టెంబర్ 2025 5 తూర్పుగోదావరి



ఉత్సాహంగా కరాటే ట్రైనింగ్ క్యాంప్

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో యర్నగూడెం రోడ్‌లో ఉన్న షాదీఖానాలో మాస్టర్ ముదునూరి రామ్మోహనరాజు ఆధ్వర్యంలో కరాటే నేషనల్ ట్రైనింగ్ క్యాంప్‌ను సోమవారం నిర్వహించారు. ఈ ట్రైనింగ్‌కి జార్ఖండ్, తెలంగాణ, వెస్ట్ బెంగాల్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. హాజరైన విద్యార్థులకు ఆలిండియా మెజిరియా కరాటే చీఫ్ ఎల్.నాగేశ్వరరావు ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ ముదునూరి రామ్మోహనరాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వ్యక్తిగత రక్షణకు, పిల్లలకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ట్రైనింగ్‌లో 10 బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లు, ఇతర బెల్ట్ టెస్ట్‌లు నిర్వహించామన్నారు. ఈ క్యాంపులో స్టేట్ ట్రెజరర్ ముదునూరి ప్రసన్నకుమారి, స్టేట్ డైరెక్టర్ ఎం.వి.రమణ, స్టేట్ డైరెక్టర్ వై.రాము, వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ కెవిఎన్.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కంద రైతు కుదేలు

- మార్కెట్లో ధర లేక ఇబ్బందులు
- గతంలో పోల్చితే పుట్టుకు రూ.5వేలు తగ్గుదల

ప్రజాశక్తి - పెరవలి

దిగుబడి ఉన్నా మార్కెట్లో గిట్టుబాటు ధర లేక కంద రైతులు కుదేలవుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. గతంలో పుట్టుకు రూ.11వేల వరకూ ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్లో పుట్టు(250 కిలోలు) కంద ధర రూ.6వేల నుంచి రూ.6,200 మాత్రమే ఉంది. దీంతో దిగుబడి బట్టి ఎకరాకు రూ.1.05 లక్షల నుంచి రూ.2.25 లక్షల వరకూ రైతులకు నష్టం వాటిల్లుతోంది.

జిల్లాలో గతేడాది 2,625 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. గతేడాది పుట్టు(232 కేజీలు) ధర ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది మరో వేయి ఎకరాల్లో సాగును విస్తరించారు. పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి, కడియం, అనపర్తి, రాజమహేంద్రవరం రూరల్, బిక్కవోలు మండలాల్లో ఈ ఏడాది 3,625 ఎకరాల్లో ఆరువేల మందికిపైగా రైతులు కంద సాగు చేపట్టారు. గతేడాది ఎకరాకు 55 పుట్టుల నుంచి 60 పుట్టుల వరకూ దిగుబడి రాగా, ఈ ఏడాది ఎకరాకు 70 పుట్టుల వరకూ దిగుబడి వచ్చింది. దీంతో కంద ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది ప్రారంభంలో పుట్టు ధర రూ.7వేల నుంచి ప్రారంభమై, ప్రస్తుతం రూ.6వేలకు పడిపోయింది.



దుంపలు తవ్విన కంద చేను, ఇన్‌సెట్‌లో కందను వ్యాన్‌లోకి లోడు చేస్తున్న కార్మికులు

ఎకరా కంద సాగుకు రూ.5.25 లక్షలు

ఒక ఎకరాలో కందను సాగు చేయాలంటే అక్షరాల రూ.5.25 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ఈ ఏడాది పుట్టు విత్తనం రూ.11 వేలు ఉంది. ఎకరాకు 30 పుట్లు విత్తనం వేయాల్సి ఉంటుంది. అంటే ఒక్క విత్తనానికే రూ.3.30 లక్షల వరకూ ఖర్చు అయ్యింది. దుక్కు, నాట్లు, బోదెలు తవ్వడానికి మరో రూ.లక్ష, పెంట వేయడానికి రూ.30వేలు, ఎరువులు, పురుగు మందులకు మరో రూ.40వేలు, నీటి తడులు, కలుపుతీతకు మరో రూ.25 వేల వరకూ ఖర్చు అయ్యింది. దాదాపు రూ.5.25 లక్షలు పెట్టుబడి అవుతుంది. రవాణా ఖర్చులు అదనం. ఎకరాకు రూ.50 పుట్టులు దిగుబడి వస్తే ప్రస్తుత ధర ప్రకారం రూ.6వేల ప్రకారం ఎకరాకు రూ.3లక్షలు మాత్రమే ఉంటుంది. అంటే రూ.2.25లక్షలు నష్టం వస్తుంది. 60 పుట్టులు ఉంటే రూ.3.60 లక్షలు, 70 పుట్టులు ఉంటే రూ.4.25 లక్షలు మాత్రమే రైతుకు అందుతుంది. అంటే కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

పెట్టుబడి కూడా రావట్లేదు



నేను గత ఏడేళ్లుగా మూడు ఎకరాల్లో కంద సాగు చేస్తున్నాను. విత్తనాలు పుట్టు రూ.11 వేలకు కొనుగోలు చేశాను. ఎకరాకు 30 పుట్టులు చొప్పున వేశాను. దుక్కులు, ఎరువులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరాకు రూ.5లక్షలు పైగా ఖర్చు చేశాను. ఎకరాకు 60 పుట్టుల వరకూ దిగుబడి వచ్చింది. పుట్టు రూ.6వేలు మాత్రమే ఉంది. దీంతో ఎకరాకు రూ.1.50 నుంచి రూ.250 లక్షల వరకూ నష్టం వచ్చింది. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాం. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర కల్పించాలి.

- బొలిశెట్టి వెంకటేశ్వరరావు, కందరైతు, అన్నవరప్పాడు, పెరవలి మండలం

ధర ఇలాగే ఉంటే నష్టపోతాం..



గతంలో ధర బాగుందని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశాం. దిగుబడి కూడా బాగా ఉంది. కాని ధర లేదు. దీంతో ఒక్కో రైతుకు రూ.లక్షల్లోనే నష్టం ఉంది. ఇదే ధర ఉంటే నష్టాలు తప్పవు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

- బొలిశెట్టి శ్రీను, కంద రైతు, అన్నవరప్పాడు గ్రామం



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

వైద్య, విద్య, ఆరోగ్య రంగాలను అభివృద్ధి చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వైద్య విద్య, ఆరోగ్య రంగాలను ప్రభుత్వ రంగంలోనే ఉంచి అభివృద్ధి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్యశ్రీపై తీసుకున్న నిర్ణయం ప్రజారోగ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం బి.పవన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి టి.అరుణ్ స్థానిక ప్రజా సమస్యలపై రాబోయే కాలంలో చేపట్టాల్సిన ఉద్యమాలపై నివేదిక ప్రవేశపెట్టారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉమామహేశ్వరరావు హాజరై మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రారంభించిన 10 మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో కూటమి ప్రభుత్వం ప్రయివేటు పరం చేయాలను కోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే వైద్య కళాశాలలు ప్రతిభ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తాయన్నారు. అదే ప్రయివేటు యాజమాన్యాలు సంపన్నులకే సీట్లు కేటాయిస్తాయన్నారు. వ్యాపార దక్పథం ముందుకొచ్చి పేదలకు వైద్యం అందడం తగ్గిపోతుందన్నారు. వైద్యం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండడమే సరైనదన్నారు. ప్రయివేటు ఆజమాయిషీలో ఉన్న కళాశాలల్లో ఫీజులు, అడ్మిషన్లు, వాటిలో డొల్లతనం అనేక సందర్భాల్లో బయటపడిందని గుర్తు చేశారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో మెడికల్ కాలేజీల్లో ఉన్న రిజర్వేషన్ సీట్లలో సగం సీట్లను లక్షలకు అమ్ముకునే జీవో 107, 108లను రద్దు చేయాలన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ వైద్యం బలపడి ఉచితంగా అందిస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ వైద్యానికి ప్రత్యామ్నాయంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడం కొన్ని పెద్ద జబ్బులకు కొంత ఊరట కలిగించినప్పటికీ పూర్తి పరిష్కారం కాదన్నారు. ఈ కొద్ది సహాయం చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకాన్ని కూడా ఇన్స్యూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి చేతులు దులుపు కోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలు వ్యాపారం చేస్తాయి తప్ప సేవ చేయమన్నారు. పంటల బీమాను ప్రయివేటు కంపెనీలకు అప్పగించడం వల్ల రైతులకు ఎంత చేటు కలిగిందో నిరూపితమైందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, తులసి, జిల్లా కమిటీ సభ్యులు బివిఎన్.పూర్ణిమరాజు, ఎస్ఎస్.మూర్తి, ఎం.సుందరబాబు, ఐ.సుబ్రహ్మణ్యం, బేబీరాణి, కర్రి రామకృష్ణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, డాక్టర్ రత్న మాధురి ప్రజలకు సూచించారు. కడియం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ప్రసాద్ అధ్యక్షతన సిహెచ్‌సి, పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎఎన్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడారు. మండలంలో రెండు పిహెచ్‌సిలు, కడియంలోని సిహెచ్‌సిలో అనేక రకాల వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగానే మందులు అందిస్తారన్నారు. చాలా మంది అవగాహన లేక ఈ సదుపాయాలు పొందలేకపోతున్నారన్నారు. ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రజలు వైద్య సేవలను సక్రమంగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.కడియం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రత్న మాధురి మాట్లాడుతూ ఆసుపత్రిలో చాలా రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని అరిదైన ఇంజక్షన్లు, గర్భిణులకు స్కానింగ్ తదితర సదుపాయాలు వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రమేష్, వైద్యులు మణిజోత్స్న, జెస్సి సుప్రియ, మౌర్య, నాయకులు వెలుగుబంటినాని, ముద్రగడ జమ్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిరుకూరి ప్రభ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రత్న మాధురి



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక దీపిక కళ్యాణమండపంలో మూడు మండలాల లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో ఇప్పటి వరకు రూ.40,01,784 విలువైన ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం 47 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.29,01,784 విలువైన చెక్కులను అందించామన్నారు. పార్టీలకతీతంగా ఈ సాయం అందిస్తున్నామని తెలిపారు. నియోజవర్గంలో రోడ్లకు రూ.11 కోట్ల ఉపాధి నిధులు సిద్ధంగా ఉన్నాయని, టెండర్లు పూర్తి కాగానే పనులు మొదలు పెడతామన్నారు. ఆర్ అండ్ బి రోడ్ల కోసం రూ.20 కోట్ల ప్రతిపాదనలు పెట్టగా రూ.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. మిగిలిన రూ.15 కోట్లు వచ్చేలా చర్యలు తీసుకుంటా మన్నారు. నిడదవోలు - నరసాపురం ఆర్ అండ్ బి రోడ్, ఉసులుమర్రు - కానూరుకు సిసి రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నిల్వ ఉండని కూరగాయలు, ఇతర పంటల విషయంలో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోఉద్యానవన, మార్కెటింగ్ అధికారులు, శాస్త్రవేత్తలు, మైక్రో ఇరిగేషన్ నిపుణులు, రైతులు, వ్యాపార వర్గాల ప్రతినిధులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఒకే పంటను వరుసగా పండించడం వల్ల ధరలు పడిపోవడం, మార్కెట్ ఒడిదుడుకులు రావడం వంటి సమస్యలు వస్తాయన్నారు. అందువల్ల పంటల్లో విభిన్నతపై దృష్టి పెట్టాలన్నారు. రైతుల ఉత్పత్తులను ఎఫ్‌పిఒ(ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) పరిధిలోకి తీసుకురావడం ద్వారా గ్రేడింగ్, ప్యాకేజింగ్, డిమాండ్ ఉన్న మార్కెట్లకు సరుకుల పంపిణీ సులభతరం అవుతుందన్నారు. దీని కోసం డిపిఆర్(డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎఫ్‌పిఒల ద్వారా లాజిస్టిక్స్, మార్కెట్ కనెక్టివిటీని బలోపేతం చేస్తే రైతులకు నిజమైన లాభం వస్తుందన్నారు. నిల్వ ఉండని కూరగాయల మార్కెటింగ్‌లో గ్రేడింగ్ సిస్టమ్ ప్రవేశపెట్టి, వాటికి తగిన ధర రాబట్టే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంద సాగు విధానం, ఇతర పంటల సాగు కోసం కంద రెడ్డి గారి ఆలోచనా ధోరణి ఎంతో స్ఫూర్తి కలిగించిందని, రైతులకు లాభసాటిగా వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని కలెక్టర్ సూచించారు. హార్టికల్చర్ రైతు కంద రెడ్డి (సత్తి భాస్కర్ రెడ్డి), హోల్‌సేల్ వ్యాపారి ఎ.గణపతి మాట్లాడుతూ పస్తుతం ఒక పుట్టి (250 కేజీ) మార్కెట్‌లో రూ.5వేలు నుంచి రూ.6వేల మధ్య పలుకుతుందన్నారు. రూ.8వేలు దాటితేనే లాభదాయకమన్నారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ అధికారి కె.మల్లికార్జునరావు, ఎపి ఎంఐపిపిడి ఎ.దుర్గేష్, కొవ్వూరు వ్యవసాయ, అరటి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.మమత, ఎడి మార్కెటింగ్ ఎం.సునీల్ వినయ్ కుమార్, రైతులు పి.కృష్ణ మూర్తి, వ్యాపారవేత్త గణపతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

బెల్ట్ షాపులను తక్షణం తొలగించాలి

ఎపి కల్లు గీత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి

ప్రజాశక్తి -కొవ్వూరు

బెల్ట్ షాపులను తక్షణం తొలగించాలి కల్లు గీత కుటుంబాలను ఆదుకోవాలి ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. కొవ్వూరు పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో కల్లుగీత కార్మికుల జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యం ఆటోల ద్వారా డోర్ డెలివరీ ఆపాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఆక్రమ మద్యం ఏరులై పారుతుందన్నారు. లెక్క లేనన్ని బెల్ట్ షాపులు పెట్టి కల్లుగీత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. చర్యలు తీసుకోవాల్సిన ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తుందన్నారు. సిండికేట్లు, ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కలసి నెలనెలా మామూళ్లు దండుకుంటున్నారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా రాష్ట్రంలో గీత కార్మికుల పరిస్థితిలో మాత్రం మార్పు రావట్లేదన్నారు. గీత కార్మికులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారు తప్ప ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయట్లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తరరాతలు మారతాయని ఆశించిచామన్నారు. కాని మద్యంతో కల్లు అమ్మకాలు లేక సంక్షోభంలో కూరుకు పోయామన్నారు. తక్షణం బెల్ట్ షాపులు, అక్రమ మద్యం డోర్ డెలివరీ అరికట్టాలని డిమాండ్ చేశారు. కేరళ, తెలంగాణ ప్రభుత్వాల మాదిరిగా గీత కార్మికులకు ఉపాధి పెంచే మార్గాలు చూడాలన్నారు. వెంటనే ఆదరణ పథకం ప్రవేశపెట్టి సేఫ్టీ మోకులు, మోటార్ సైకిల్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గీత కార్మికుల సమస్యలపై 19న జరిగే జిల్లా మహా సభలో చర్చిస్తామనిఅన్నారు. ఈ సమావేశంలో వివిధ మండలాల నాయకులు కోమటి శ్రీనివాస్, జుత్తిగ పోసిరావు, గుబ్బల నరసింహారావు, ఎన్.సూరిబాబు, ఎస్.శ్రీనివాసరావు, కె.వీరబుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహమూర్తి

జెవివి ఉపాధ్యక్షునిగా చిలుకూరి

ప్రజాశక్తి-కడియం

జెవివి జిల్లా ఉపాధ్యక్షునిగా చిలుకూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శిగా న్యాయవాది తోరాటి వసంతరావు ఎన్నికయ్యారు. జెవివి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం రాజమహేంద్రవరం యుటిఎఫ్ హోమ్‌లో జరిగింది. జెవివి రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీ మిడియం బాబురావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మూడు దశాబ్దాలుగా మూఢ నమ్మకాల దుష్ప్రభావాలను, సాంకేతిక దృక్పథాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్న వీరికి జిల్లా కమిటీలో స్థానం కల్పించారు. అలాగే కడియం మండలం వెంకాయమ్మాపేట ప్రాథమికపాఠశాలలోఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సాకా అనిత కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. డాక్టర్ గుర్రాల వెంకట్రావు, తమ్మిశెట్టి ప్రసాద్ తదితరులు వీరి నియామకం పట్ల అభినందనలు తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీలకు లక్ష్మీశ్రీసాయి ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరులోని ఇఎఆర్ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థిని లక్ష్మిశ్రీసాయి జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం నారాయణపూర్‌లో ఆగస్టు 25, 30న జరిగిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పాఠశాల క్రీడా సంఘం నిర్వహించిన సమావేశంలో లక్ష్మిశ్రీసాయిని జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీసాయిశ్రీ మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ కె.ప్రభాకరరావుబి హెచ్‌ఎం పి.షాలినిసౌజన్య, బోధన సిబ్బంది, పిఇటి సయ్యద్ షఫీ ప్రోత్సాహం వల్లే తాను ఈ ఘనత సాధించానని తెలిపింది.

అర్జీలు స్వీకరించిన మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - పెరవలి

మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అర్జీలు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత కాలవ్యధిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రియా సౌజన్య, తహశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ కె.ఉమారాజ్యలక్ష్మిపద్మజ, ఎఒ గంటా శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శంకర్, ఎపిఎం రామకృష్ణ, ఇఒపిఆర్‌డి సిహెచ్.వెంకటరమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో 'స్టెప్ టు సక్సెస్'


ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో సోమవారం 'స్టెప్ టు సక్సెస్' కార్యక్రమాన్ని కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సిఎస్‌పిఐఎఎస్ స్టడీసెంటర్ వ్యవస్థాపకురాలు మల్లవరపు బాలలత విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కచ్చితమైన లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. లక్ష్యం కోసం నిరంతరం నిలకడగా శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. బాలలత వంటి వారు తమ విద్యార్థులకు అవగాహన కల్పిచేందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెరీర్ గైడన్స్ సెల్ కో-ఆర్డినేటర్ బి.వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ దిశగా ముందుకు సాగడానికి భవిష్యత్తులో కూడా దిశా నిర్దేశం చేయాలని బాలలతను కరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ జరీనా బేగం డాక్టర్ బి.సుబ్బలక్ష్మి డాక్టర్ నూజిల్ల శ్రీనివాస్, డాక్టర్ బి.మల్లికార్జున్, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

5 వేల మందికి అన్నదానం

తాళ్లపూడి : తాళ్లపూడి బస్టాండ్ సెంటర్లో గల దేవాలయాల సముదాయం వద్ద సోమవారం 5వేల మందికి అన్నదానం చేశారు. గణపతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద శ్రీ విఘ్నేశ్వర మోదుగులమ్మ సుబ్రహ్మణ్యేశ్వర వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద జరిగిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్, టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగాఆలయం వద్ద జరుగుతున్న అన్నదానానికి గ్రామస్తులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు.

కార్టూ'నిజం'



అర్జీల పరిష్కారంలో జాప్యం తగదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పిజిఆర్‌ఎస్‌లో వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దని జెసి మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్‌ఎస్ భవనంలో డిఆర్ఒ టి.సీతా రామమూర్తి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేఘ స్వరూప్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉద్దేశ్య పూర్వకంగా అర్జీని పరిష్కరించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. పాలనా పరంగా పరిష్కారం కానీ అర్జీల విషయంలో సమస్య సంక్లిష్టతను అర్జీదారులకు వివరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. సంతృప్తికర పరిష్కారం లేకపోవడం వల్లే ఫిర్యాదులు మళ్లీ రీఓపెన్ అవుతున్నాయన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

మరిన్ని అవార్డులు అందుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉత్తమ ఉపాధ్యాయినిగా జిల్లా స్థాయిలో అవార్డు సాధించిన పులి కుసుమ భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించి, మండలానికి, గ్రామానికి మంచి గుర్తింపు తీసుకు రావాలని పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు కోమట్లపల్లి వెంకట సుబ్బారావు అన్నారు. సోమవారం కాల్దారి నెంబర్-3 పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో, గ్రామ పెద్దల సమక్షంలో కుసుమను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో కుసుమ మరిన్ని అవార్డులు గెలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ ఈ అవార్డు సాధనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్.కుమారి, ఉప సర్పంచ్ ఈర్పిన సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు కోమట్లపల్లి రామదాసు, మండల నాయకులు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాకు వచ్చిన మూడు ఎఎల్ఎస్(అడ్వాన్స్డ్ లైఫ్ సపోర్ట్) అంబులెన్సులను సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరారవు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 21 అంబులెన్సులు పని చేస్తున్నాయన్నారు. వీటిలో పాత 11 అంబులెన్సు వాహనాల స్థానంలో, ఆధునిక వైద్య సౌకర్యాలతో కూడిన ఐదు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు, 6 బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలను ప్రభుత్వం జిల్లాకి మంజూరు చేసిందన్నారు. మొదటి విడతగా జిల్లాకు మూడు ఎఎల్ఎస్ అంబులెన్సులు వచ్చాయన్నారు. ఈ అంబులెన్సుల్లో ఆక్సిజన్ సిలిండర్లు, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్లు, ఎఇడి పరికరాలు, అత్యవసర ఇంజక్షన్లు, మందులు వంటి ఆధునిక పరికరాలు అందుబాటులో ఉంటాయన్నారు. రోగులను ఆసుపత్రికి తరలించే సమయంలోనే ప్రాణ రక్షణ వైద్య సేవలు అందించడం సాధ్యం అవుతుందని తెలిపారు. మరో 15 రోజుల్లో మిగిలిన 8 అంబులెన్సులు జిల్లాకు చేరనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డిసిహెచ్‌ఎస్ ఎం.పద్మ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట

కొత్తపేట మారుతి సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన అప్పారి సత్యనారాయణ వ్యక్తిగత పనిపై ద్విచక్రవాహనంపై కొత్తపేట వచ్చాడు. కొత్తపేట నుంచి రావులపాలెం వెళ్తుండగా కొత్తపేట మారుతీ సెంటర్‌లో వెనక నుంచి వచ్చిన లారీ సత్యనారాయణను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతని కాలుకు తీవ్రగాయం అయింది. ఇదే తరుణంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కొత్తపేట నుంచి పలివెల వెళ్తూ ప్రమాద సంఘటనను చూసి ఆగారు. క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కొత్తపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులను ఆదేశించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జి.సురేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని చిత్రాడలో ఆటో ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి సోమవారం రాత్రి గ్రామానికి చెందిన ఎం శేషారత్నం(58) రోడ్డు దాటుతుండగా కాకినాడ నుంచి పిఠాపురం వైపు వస్తున్న ఆటో బలంగా ఢీకొనడంతో శేషారత్నం ఘటనా స్థలంలోనే స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు హైవే అంబులెన్సులో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాద సంఘటనపై పట్టణ ఎస్ఐ మణికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసుల్లో ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు తెలిపారు. గోకవరం గ్రామానికి చెందిన తొండ శాంతి, ఆవుల భూలక్ష్మి ఆర్‌టిసి బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికుల దృష్టి మళ్లించి బ్యాగులను తస్కరిస్తూ నగదు, బంగారు వస్తువులను అపహరించేవారని తెలిపారు. వీరిద్దరూ ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడి, అన్నవరం స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్టు తెలిపారు. వారి నుంచి రూ.2 లక్షల నగదు, 106 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అన్నవరం ఎస్ఐ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని గరప్పాడు గ్రామానికి చెందిన సూరగాని రమ్యశ్రీ (19) అదృశ్యమైందని ఆమె తల్లి సూరగాని సాయిలక్ష్మి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లిన తమ కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరలదేని తెలిపారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు.

సిఎస్ఆర్ నిధులు సక్రమంగా వినియోగించాలి

యానాం : ప్రాంతీయ పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టిన అంకిత్ కుమార్‌ను రిటైర్డ్ అండర్ సెక్రెటరీ గిడ్డి బలరామ్, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పండు సిద్ధార్థ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. దీనిలో ముఖ్యంగా సిఎస్ఆర్ నిధులు యానాం అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని అందించారు.

ఘనంగా వరల్డ్ ఫిజియోథెరపీ డే

యానాం : భారత సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ సహకారంతో డైరెక్టర్ బివి రామ్ కుమార్ ఆధ్వర్యంలో సోషల్ వెల్ఫేర్, ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ అధ్యక్షతన స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో వరల్డ్ ఫిజియోథెరపీ డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ అంకిత్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఫిజియోథెరపీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యెతేంద్ర కుమార్, ఎస్‌పి.రెడ్డి, మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిఫ్కా రోషియో, శ్రీకాంత్, ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ ప్రాంతం పరిశీలన

యానాం : కొన్ని రోజుల క్రితం దరియాలతిప్ప ఐలాండ్ నెంబర్ 3 సమీపంలో ఒఎన్‌జిసికి సంబంధించిన గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని ఆర్ఎఒ అంకిత్ కుమార్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రజల ఫిర్యాదు మేరకు దరియాలతిప్ప వాటర్ ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ అధికారి డి.గొంతయ్య, పిడబ్ల్యుడి ఇఇ కాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు విధుల నుంచి మినహాయించాలి

దేవరపల్లి : అదనపు విధుల నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని డ్వాక్రా విఎఎలు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కెవికె దుర్గారావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విఎఎలు మాట్లాడారు. ప్రతి నెలా పెన్షన్ల బట్వాడా పనుల వల్ల తమ ప్రధాన విధులపై భారం పెరుగుతుందన్నారు. పలు గ్రామ పంచాయతీల్లో విఎఎలు ఇప్పటికే అనేక బాధ్యతలు నిర్వహిస్తున్నందున ఈ అదనపు పని వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిపై ఎంపిపి స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రెయిన్ గేజ్‌ల పరిశీలన

గోపాలపురం : గోపాలపురం తహశీల్దార్ కార్యాలయం పైన ఉన్న రెయిన్‌గేజ్‌లకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు వర్షపాతం కొలిచేందుకు మండలంలో 3 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్ ఉన్నట్లు తెలిపారు. వీటి పనితీరు పరిశీలించేందుకు రాజమహేంద్రవరం నుంచి ఇద్దరు టెక్నీషియన్లు వచ్చారన్నారు. నూతన బ్యాటరీ ను మార్చినట్లు తెలిపారు.

రణభేరి జాతా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజానగరం

ప్రభుత్వ విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి యుటిఎఫ్ నిర్వహించ తలపెట్టిన రణభేరి జాతా పోస్టర్‌ను యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో రాజానగరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు ప్రాంతాల నుంచి రణభేరి జాతాలు ప్రారంభమవుతాయన్నారు. ఐదు రోజుల పాటు అన్ని ప్రాంతాల్లో ఈ జాతాలు పర్యటిస్తాయన్నారు. ప్రభుత్వ విధానాలు విద్యావ్యవస్థను అధోగతిపాలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాలతో రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. జిల్లా కార్యదర్శి సిహెచ్.దయానిధి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యా యులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని చెప్పిన కూటమి సర్కారు ఇప్పుడు పెదవి కూడా విప్పట్లేదన్నారు. పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షులు ఐడికెడి రాజేశ్వరి మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించాల న్నారు. మాజీ అధ్యక్షులు శ్రీనుబాబు మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మండల కార్యదర్శి ఫణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్జీలపై క్షేత్ర స్థాయి పరిశీలన అవసరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వస్తున్న ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో అదనపు కమిషనర్ నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 14 ఫిర్యాదులు రాగా.. వీటిలో ఇంజనీరింగ్ కి సంబంధించి 9, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి ఒకటి, రెవిన్యూకు సంబంధించి ఒకటి, పబ్లిక్ హెల్త్ కి సంబంధించి రెండు, వార్డు సచివాలయాలకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ప్రతి అర్జీ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. పరిష్కారం కాకుంటే సహేతుకమైన కారణాన్ని అర్జీదారునికి తెలియజేయాలన్నారు. ఈ బాధ్యత పూర్తిగా అధికారులదనేని స్పష్టం చేవారు. అర్జీదారులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ఈ నెంబర్‌కు కాల్ చేసి అర్జీ ప్రస్తుతం ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అర్జీలను ఆ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచన్నారు. అనంతరం వార్డు సచివాలయాల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎంహెచ్ఒ వినూత్న, ఎస్ఇ రీటా, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్య వైద్య రంగాలకు పెద్ద పీట

ప్రజాశక్తి - తాళ్లపూడి

విద్య వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మలకపల్లి సహకార బ్యాంకు అధ్యక్షులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి ఆర్థిక సాయంతో మండలంలోని మలకపల్లి, పెద్దేవం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు రూ.1.40 లక్షల విలువైన క్రీడా దుస్తులు, ఆట సామగ్రి, వంట ఏజెన్సీకి వంట పాత్రలు, డిజిటల్ కంప్యూటర్ సిస్టం అందజేశారు. అనంతరం మలకపల్లి పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. మలకపల్లి, తాళ్లపూడి గ్రామాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు మంజూరైన సుమారు 3లక్షల 37 వేల రూపాయల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి, సహకార బ్యాంకు అధ్యక్షులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఉప సర్పంచ్ రామారావు, మద్దిపాటి ప్రకాశం, టిడిపి నాయకులు కోడి శంకరం, తిగిరిపల్లి గోపి, బి.శంకరం, ఎస్.దుర్గారావు, ఎంపిటిసి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి -దేవరపల్లి

సోమవారం దేవరపల్లి మండలం ఎస్‌టియు ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు గ్రహీతలను సన్మానించారు .ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ హెచ్ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైన పవిత్రమైన వృత్తి అన్నారు. అవార్డు పొందిన శ్రీనివాసరావు, నాగరాజు, గంగరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు, భాషా, కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరం : గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు అందుకున్న రొబ్బి కృష్ణవేణిని గోకవరం జడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పడాల సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. జగ్గంపేట, గోకవరం మండలాల్లో 20 ఏళ్ల నుంచి పని చేస్తూ ఇటీవల గోకవరం జడ్‌పిహెచ్ఎస్‌కు కృష్ణవేణి బదిలీ అయ్యారన్నారు. విధుల విషయంలో నిబద్ధతతో పని చేస్తారన్నారు. ఆమెకు అవార్డు రావడం గర్వించదగ్గ విషయం అన్నారు.



కాలువల చెంతనే చెత్త డంపింగ్

కలుషితమవుతున్న జలాలు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని పలు గ్రామాల్లో సేకరించిన చెత్తను ప్రధాన కాలువ వెంబడి డంప్ చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే తంతు కొనసాగుతుంది. రాత్రి పగలు లేకుండా ఈ చెత్తకు నిప్పు పెట్టడంతో సమీప ప్రాంతాల ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త ఎక్కువ పేరుకుపోతే యంత్రాల ద్వారా నేరుగా కాలువల్లోకి నెట్టి చేతులు దులిపేసుకుంటున్నారు. ఫలితంగా ప్రధాన కాలువ నీరు కలుషితమవుతుంది. అంతేకాకుండా కాలువ కుచించుకుపోతుంది. వేమగిరి, కడియం, కడియపులంక గ్రామాలు చెత్తడంపింగ్‌లో ముందు వరుసలో ఉండగా తాజాగా కడియపు సావరం గ్రామం కూడా ఇదే కోవలోకి చేరింది. సోమవారం కడియం బొబ్బిలి బ్రిడ్జి సెంటర్ నుంచి జేగురుపాడు వెళ్ల ప్రధాన కాలువగట్టున డంప్ చేసిన చెత్తను యంత్రంతో కాలువలోనికి నెట్టేవారు. ఈ పనులను కడియపు సావరం పంచాయతీ సిబ్బంది దగ్గరుండి మరీ పర్యవేక్షించారు.

అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలి

ప్రజాశక్తి -కొవ్వూరు

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నూరు శాతంతో పరిష్కరించాలని కెఆర్‌సి తహశీల్దార్ పి.అచ్యుతకుమారి సూచించారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ సోమవారం 19 అర్జీలు వచ్చాయన్నారు. అర్జీదారులు సంతృప్తి పడేలా పరిష్కారం చూపాలన్నారు. ప్రజలకు అత్యంత చేరువగా సుపరిపాలన అందించేందుకు వివిధ స్థాయిల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలు ఏర్పాటు చేశామని వివరించారు. అర్జీల కోసం 1100 కాల్ సెంటర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

హోమియో వైద్యులతో అదనపు కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగర పాలక సంస్థ పిజిఆర్ఎస్ హాల్లో హోమియో వైద్యులతో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రుల సమయ వేళలు, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అవుట్ పేషంట్ల వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. మందుల కొరత ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆస్పత్రుల ప్రాంగణంలో పరిశుభ్రత మెరుగ్గా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

తేతలి- మునిపల్లి రోడ్డుకు మరమ్మతులు

నేటి నుంచి నెలరోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి -కొవ్వూరు

కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలో తేతలి-మునిపల్లి రోడ్డులో కాల్దారి గ్రామంలోని రైల్వే అండర్ పాస్ వద్ద సిసి రోడ్డు నిర్మాణం కొనసాగుతున్నందున ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్ అండ్ బి డిఇ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈనెల 9వ తేదీ నుంచి నెల రోజుల పాటు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ను నిలిపేస్తున్నామన్నారు. ప్రయాణికులు, వాహనదారులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బస్సుల కొరతతో విద్యార్థుల కష్టాలు

ప్రజాశక్తి -కరప

మండల కేంద్రమైన కరపలో కాలేజీ విద్యార్థులు ఆర్‌టిసి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కళాశాలలకు చేరుకోవడానికి విద్యార్థులు ఆర్‌టిసి బస్సులపై ప్రధానంగా ఆధారపడుతుంటారు. మండల కేంద్రమైన కరప నుంచి పెదపూడి మండలం సంపర, పుట్టకొండ, కాండ్రేగుల, సహపురం, కరప మండలం అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరుపల్లి, వలసపాకల, వేములవాడ వేళంగి గ్రామాల నుంచి వందలాది మంది పేద విద్యార్థులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం కొనసాగిస్తున్నారు. వీరికి ప్రత్యేకమైన బస్సులు వెయ్యకపోవడంతో ఎంతోకాలంగా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ఉచిత ప్రయాణంతో విద్యార్థులకు పాఠశాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పెరిగాయి. మహిళా ప్రయాణికులు పెద్ద ఎత్తున ప్రయాణం చేస్తుండడంతో బస్సుల్లో సీట్లు ఖాళీగా లేని పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఎక్కేందుకు అవకాశం కూడా లేకపోవడం వల్ల ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సులు వేయాలని వారు కోరుతున్నారు.



ఫుట్‌బోర్డ్‌పై విద్యార్థులు, దిగిపోవాలని కోరుతున్న డ్రైవర్



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

యూరియా గొడౌన్లలో తనిఖీలు

ప్రజాశక్తి - గోకవరం, రాజానగరం

మండలంలోని గోకవరం, కమరాజుపేట సొసైటీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు జె.శశి బిందు, గోకవరం ఎఒ పి.రాజేశ్వరి, కోరుకొండ సిఐ వై.సత్యకిశోర్, గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్‌తో కలిసి తనికీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడనవసరం లేదని తెలిపారు. సొసైటీల్లో 172 టన్నుల, ప్రయివేటు షాప్‌ల్లో 20 టన్నుల మొత్తం 192 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎలు,సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రాజానగరం మండలంలో ఎరువుల నిల్వల గొడౌన్లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. భూపాలపట్నం సొసైటీలోలో వ్యత్యాసం ఉన్నట్లుగా అధికారుల గుర్తించారు. సరుకు క్రమంగా లేకపోవడంతో యూరియా నిల్వల రికార్డులో తేడాలు ఉందని ,సరి చేయాలని సూచించారు. అప్పటి వరకు అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అనంతరం రాజానగరం మన గ్రామోర్ ఎరువుల గోదాముల్లో తనిఖీలు చేవారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ జి.మధుబాబు, అసిస్టెంట్ జియాలజిస్ట్ ఎస్‌వి.లక్ష్మీ నారాయణ, ఎఒ ఎ.కళ్యాణ్‌సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గొల్లప్రోలులో ఆదివారం సాయంత్రం కురిసిన భారీవర్షం, ఈదురు గాలులకు ఇంటి పైకప్పు పడి పోయింది. గొల్లప్రోలు పట్టణంలోని మార్కండేయపురానికి చెందిన రాపర్తి గనిరాజుకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయి సామాన్లు విరిగిపోయాయి. వారు నిరాశ్రయులయ్యారు. కూలిపోయే సమయానికి కుటుంబం బయటకు పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పినట్టు స్థానికులు తెలిపారు.

ముద్రగడను కలిసిన ముదునూరి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మాజీ మంత్రి వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును సోమవారం కిర్లంపూడిలో ముద్రగడ నివాసంలో వైసిపి నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. అనంతరం మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ 2029లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగరవేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జువ్వల దొరబాబు, కోలా తాతబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గిరిబాబుతో ముదునూరి మురళీకృష్ణం రాజు

ట్రంప్ పెంచిన ఎగుమతి సుంకాలు తగ్గించాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఆక్వా రైతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం పన్నులు తగ్గించాలని సోమవారం రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురాల అప్పారెడ్డి, రైతు సంఘం నాయకులు జి.వెంకటసుబ్బారెడ్డి రొయ్యల చెరువుల రైతులను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10న విజయవాడలో జరిగే రొయ్య రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వారు కోరారు.



అర్జీలు అందిస్తున్న ఇమామ్‌లు

ఇమామ్‌ల గౌరవ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఆదాయం తక్కువ ఉన్న మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లకు ఇవ్వాల్సిన 11 నెలల గౌరవ వేతనాలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 సెప్టెంబర్ వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనాల బకాయిలు, ఎలక్షన్ కాలంలో ఇవ్వాల్సిన మూడు నెలల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నవి మొత్తం కలిపి 11 నెలలవి ఇవ్వాల్సి ఉందన్నారు. వైసిపి నాయకులు ఎస్‌కె.కరీం బాషా, ఎండి బాషా, ఖాలిద్ బిన్ వాలిద్, రెహమాన్ ఖాన్, హేమంత్, సత్యనారాయణ, అజ్జు, మయూరి అలీషా, చాంద్ బాషా, ఇర్ఫాన్, నౌషద్, కిషోర్, జిలాని, జాఫర్, మున్నా పాల్గొన్నారు.

ఎంపిడిఒలకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

శిక్షణ అనంతరం ఎంపిడిఒల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని విస్తరణ శిక్షణాకేంద్రం ఉప ప్రిన్సిపల్ జి.రమణ సూచించారు. ఎంపిడిఒలుగా ప్రమోషన్ పొందిన ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రెండో బ్యాచ్‌లో 42 మందికి నెల రోజులు ఇచ్చే శిక్షణ సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజు శిక్షణకు ముందు ఎంపిడిఒల పరిచయ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. నెల రోజుల ఈ శిక్షణతో పరిపాలన నైపుణ్యాలు మరింత పెంచుకోవాలని శిక్షణ కేంద్రం ఉప ప్రిన్సిపల్ రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో డిడిలు శ్రీనివాస్, శర్మ, ఫ్యాకల్టీ సుశీల, శేషుబాబు, చక్రపాణి రావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో చైతన్యవంతమైన సమాజం

ప్రజాశక్తి - సామర్లకోట

దేశ ప్రగతి ఆ దేశ అక్షరాస్యతపై ఆధారపడి ఉంటుందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్కూల్లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో సాయి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరంతరం ఏదో ఒక విషయం నేర్చుకోవాలని కోరారు. డిజిటల్ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు.